క్లుప్తంగా

ఘనంగా చండీ హోమం



పెదకూరపాడు: 75 తాళ్లూరులో సోమవారం చండీ హోమం నిర్వహించారు. దసరా ఉత్సవాలు ఐదో రోజు కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని చండీ దేవిగా అలంకరించారు. 13 అనువాకాలతో హోమం నిర్వహించి, పూర్ణాహుతి చేశారు. సాయి సుబ్రహ్మణ్య రాఘవశర్మ, బసవరాజు సుబ్రమణ్య శర్మ హోమం క్రతువు నిర్వహించారు. ఆలయ పూజారులు హనుమంతరావు శర్మ, హరినాథ శర్మ భక్తులకు చండీ విశిష్టతను వివరించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీ శివసాయి ట్రస్టు సభ్యులు నిర్వహణలో అన్నప్రసాద వితరణ చేశారు.

సీఐగా సుబ్బారావు బాధ్యతల స్వీకారం



సత్తెనపల్లి: సత్తెనపల్లి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంవీ సుబ్బారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా రేంజి వీఆర్ నుంచి ఆయన ఇక్కడకు వచ్చారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన మీసాల రాంబాబు గతంలో పొన్నూరు నియోజకవర్గంలోని సంగం డైరీ దగ్గర జరిగిన ఘటనలో సస్పెండ్ అయ్యారు. 2004 ఎస్ఐ బ్యాచ్‌కి చెందిన సుబ్బారావు 2011లో సీఐగా పదోన్నతి పొందారు. పాత గుంటూరు, వినుకొండ, బుచ్చిరెడ్డిపాలెం, నరసరావుపేట సర్కిల్ సీఐగా గతంలో పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన మర్యాదపూర్వకంగా సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావును కలిశారు. సత్తెనపల్లి రూరల్ సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఆర్డీవోకు సత్కారం



క్రోసూరు. సత్తెనపల్లి ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన రమణకాంత్ రెడ్డిని సోమవారం జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గార్లపాటిదాసు, యాసారపు బాబు, సత్తనపల్లి డివిజన్ సభ్యులు వేల్పుల అఖిల్ కలుసుకున్నారు. అనంతరం గార్లపాటి దాసు మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలకు చెందిన భూములు, ఇంటి నివేశ స్థలాలు వివాదాలున్నాయన్నారు. క్రోసూరు ఎస్సీ కాలనీలోని సర్వే నంబరు 552లో దుగ్గి మరియమ్మ, చిలకా మరియమ్మకు చెందిన నకిలీ ఇంటి నివేశ స్థల పట్టాలపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా రవికుమార్



సత్తెనపల్లి: డిప్యూటీ తహసీల్దార్‌గా ఎస్.రవికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన చిలకలూరిపేట తహసీల్దార్ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన రాజేంద్రప్రసాద్ జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. కాగా ఆయన ఈ నెల 9 వరకు సెలవులో ఉన్నారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన డీటీ రవి కుమార్ మర్యాద పూర్వకంగా తహసీల్దార్ శ్రీనివాస చక్రవర్తిని కలిశారు. డీటీని వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

తమిళనాడు పరిసరాల్లో వీఆర్వో జాడ?

ముప్పాళ్ల: ఇల్లు విడిచి, సూసైడ్ లెటర్ రాసి వెళ్లిన నార్నెపాడు వీఆర్వో మల్లికార్జునరావు తమిళనాడు పరిసరాల్లో ఉన్నట్లుగా జాడ తెలిసింది. ఆదివారం రాత్రి రెవెన్యూ శాఖలోని సహచరుడికి ఫోన్ చేసి యోగ క్షేమాలు, ప్రస్తుత పరిస్థితులు తెలుసుకున్నట్లు సమాచారం. దాదాపు పది నిమిషాలకు పైగా మాట్లాడి, తనకు మనశ్శాంతి లేక దేవాలయాలకు వెళ్లానని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మరో నాలుగు రోజుల్లో ఇంటికి వస్తానని చెప్పినట్లు తెలుస్తోంది. అయితే పోలీసులు మాత్రం కంటిమీద కునుకులేకుండా వెతుకులాడే పనిలో నిమగ్నమయ్యారు. వీఆర్వోకు ఉన్నటువంటి ఆర్థిక సమస్యలే ఊరు వదిలి వెళ్లడానికి ప్రధాన కారణంగా స్థానికులు చెబుతున్నారు.

విహారం కాకూడదు విషాదం

- పాఠశాలలకు దసరా సెలవులు
- ఆనందం మాటున పొంచి ఉన్న ప్రమాదం
- సరదా కోసం వెళ్తూ అనంతలోకాలకు
- తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం



కాల్వలో సరదాగా ఈతకొడుతున్న చిన్నారులు

పెదకూరపాడు: పండగ సెలవుల్లో పిల్లలు సరదాగా గడిపేందుకు ఎక్కువగా ఇష్టపడతారు. ఇదే సమయంలో ఏ విధమైన అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైన ఉంది. ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు పాఠశాలలకు దసరా సెలవులిచ్చారు. కొందరు తల్లిదండ్రులతో కలిసి విహార యాత్రలకు వెళ్తున్నారు. మరికొందరు చిన్నారులు ఊరిలోనే ఉంటూ..పొలాల బావులు, కాల్వలు, నీటి గుంతల వద్దకు వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

గత వేసవి సెలవుల్లో ఏడుగురు చిన్నారులు నీటి గుంతల్లో పడి మృతి చెందారు. ఈ ఏడాది ఏప్రిల్ 27న కన్నెగండ్ల గ్రామ పొలంలోని నీటి గుంతలో పడి పమిడిపల్లి వేణు(11), బోలేద్దుల ధనూష్(10)మృతి చెందారు. గతేడాది వేసవిలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు సారెకుక్క ఈశ్వరదేవ, కుక్కమళ్ల ప్రసంగి పొలంలోని బావిలో పడి మృతి చెందారు. రామాపురం గ్రామంలోని చెరువులో పడి ముగ్గురు చిన్నారులు మృతి చెందారు.

ప్రమాదాలకు నిలయం

పంట పొలాల్లో తీసిన బావులు, నీటి గుంతలు, కాల్వలు, ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఇలాంటి ప్రాంతాలకు పిల్లలు వెళ్లకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంది. సెలవులు వచ్చాయంటే చాలు ఈ ప్రాంతంలో ప్రమాదకర ప్రదేశాల్లో స్నానాలకు దిగి ప్రాణాలు కోల్పోతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

- పిల్లలను ఎట్టి పరిస్థితిల్లోనూ కాల్వల స్నానాలకు పంపించకూడదు.
- ఆడుకునే స్థలాల్లో బావులు, విద్యుత్ స్తంభాలు, తీగలు ప్రమాదకరంగా ఉన్నాయేమో గమనించాలి.
- ఎత్తైన మేడలు, శిథిల భవనాల్లో ఆటలాడకుండా చూడాలి.
- ఇళ్లల్లో అగ్గిపెట్టి, కిరోసిన్, పెట్రోల్ వంటి పేలుడు పదార్థాలను అందుబాటులో లేకుండా చూడాలి.
- చిన్నారులను ఒంటరిగా వాహనాలు నడపడానికి అనుమతించకూడదు. ఒకరు తోడుండాలి.
- పిల్లలపై లైంగిక దాడులు, కిడ్నాప్‌లకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అపరిచితులతో దూరంగా ఉండాలని హెచ్చరించాలి.
- డెంగీ, టైఫాయిడ్ ప్రబలుతున్న నేపథ్యంలో వర్షంలో, మురుగునీటిలో ఆడకుండా చూడాలి.
- ప్రస్తుతం గ్రామాల్లో కుక్కలు స్వైర్య విహారం చేస్తున్నాయి. కుక్కల దాడికి గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి



కాల్వల్లో స్నానాలకు, ప్రమాదకర స్థలాల్లో ఆటలకు పిల్లలను పంపించకూడదు. దసరా సెలవుల్లో చిన్నారులను ఇంటి వద్దే ఉండేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి. మైనర్లు ఎట్టి పరిస్థితిల్లో వాహనాలు నడపకూడదు. ఆకతాయిలు పిల్లలను వేధిస్తే వెంటనే పోలీసుకు ఫిర్యాదు చేయాలి.

– గిరిబాబు, ఎస్ఐ, పెదకూరపాడు.

మహిళల పరిరక్షణకు పటిష్టమైన చట్టాలు



మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ అమీన రెహ్మాని

సత్తెనపల్లి: మహిళల పరిరక్షణకు పటిష్టమైన చట్టాలను రూపొందించారని రిసోర్స్ పర్సన్ ఎస్కే అమీన రెహ్మాని అన్నారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేధికార సంస్థ సంయుక్త నిర్వహణలోమండల న్యాయసేవాధికార కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విధాన్ సే సమాధాన్ మహిళా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. అమీన రెహ్మాని మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌తో కూడిన పలు మహిళా పరిరక్షణ చట్టాలను ఆమె వివరించారు. ప్యానల్ న్యాయవాది ఎస్‌బీఏ ఝాన్సీ మాట్లాడుతూ 498ఏ, ఆస్తి హక్కులు, పోక్సో చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ముందుగా న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు సభా పరిచయం చేసి కొన్ని చట్టాలను వివరించారు. సత్తెనపల్లి ప్రభుత్వ న్యాయవాది షేక్ బాలి సైదా భ్రూణ హత్యలు, లింగనిర్ధారణ, పలు చట్టాలను వివరించారు. మున్సిపల్ మేనేజర్ ఎన్.సాంబశివరావు సమాజంలో మహిళల పాత్ర, ప్రభుత్వ పరంగా మహిళలకు అందుతున్న పలు పథకాలను వివరించారు. ప్యానల్ న్యాయవాదులు బీఎల్.కోటేశ్వర రావు, బి.అమర్‌నాయక్, గంటా వెంకటశివ, పారా లీగల్ వలంటీర్లు షేక్ సుబాని, షేక్ ఖాజా, కోట బాబురావు,షేక్ ముబారాక్, మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రజాదర్బార్

192 అర్జీలు స్వీకరణ



అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి: పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. అన్ని గ్రామాల నుంచి 192 మంది తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఎండ్రాయి గ్రామంలో ఎర్ర గ్రావెల్ క్వారీలో పదిరెట్లు అధికంగా తవ్వకాలు చేస్తున్నారని, పంట పొలాలు కోతకు గురవుతాయని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి గోగినేని వెంకటరమణ ఫిర్యాదు చేశారు. గోపాల్ నగర్‌లో మురుగు కాల్వకు అడ్డంగా కంకర, ఇటుక తోలడంతో మురుగు రోడ్డుపైకి దుర్గంధం వెదజల్లుతోందని సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు అర్జీ సమర్పించారు. అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 139 అర్జీలు, పంచాయతీరాజ్ శాఖకు 22 అర్జీలు, విద్యుత్ శాఖకు 11, వ్యవసాయశాఖ, అర్‌డబ్ల్యూఎస్‌కు నాలుగు చొప్పున ఇలా వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 192 అర్జీలు వచ్చాయి. అర్జీలన్నీ ఆయా శాఖలకు బదిలీ చేసి వెంనే పరిష్కరించాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేకల హనుమంతరావు, ఎంపీడీఓ మాధవి, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుతో మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

దళితులకు ప్రాధాన్యమివ్వాలి

అచ్చంపేట: త్వరలో ప్రవేశ పెట్టబోయే 2024–25 రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో దళిత వర్గాలకు ప్రాధాన్యం కల్పించాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు విజ్ఞప్తి చేసినట్లు జిల్లా దళిత, గిరిజన బడ్జెట్ వాచ్‌కమిటీ జిల్లా కో–ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప తెలిపారు. అమరావతిలో జరిగిన ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యేకు 24 అంశాలతో కూడిన వినతి పత్రం అందించామన్నారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల దళిత గిరిజన బడ్జెట్ వాచ్ కమిటీ కన్వీనర్ సందెపోగు అశోక్, మేడా రమణ, చిలకా విజయ్, కోటిరత్నం పాల్గొన్నారు.

సాధారణ పరిపాలన తెలుసుకోవాలి



శిక్షణలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు

క్రోసూరు: స్థానిక ప్రజా ప్రతినిధులు పంచాయతీల సాధారణ పరిపాలన తెలుసుకుని ఉండాలని పంచాయతీ విస్తరణాధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ హాలులో సోమవారం ఉప సర్పంచ్‌కు, ఇద్దరు వార్డు సభ్యులు(ఒక మహిళ, ఒక పురుషుడు)కు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం జరిగింది. తొలిరోజు కోర్సు డైరెక్టర్, ఎంపీడీఓ బి.మహేష్‌బాబు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, దొడ్లేరు పంచాయతీ కార్యదర్శి వెంకయ్య పాల్గొన్నారు. ముందుగా జాతిపిత గాంధీజీ, రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ మాట్లాడుతూ గ్రామసభల ఉద్దేశాలు, బై లా తయారుచేయడం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 18 పంచాయతీల ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలో ముఖ్యపాత్ర పోషించాలి



సత్తెనపల్లి: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రజా ప్రతినిధులు ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు ముఖ్య పాత్ర పోషించాలని సత్తెనపల్లి ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. కొమెరపూడి, కంటెపూడి, కట్టావారిపాలెం, నందిగామ, గుడిపూడి, లక్ష్మీపురం, పెదమక్కెన, గర్నెపూడి, లక్కరాజు గార్లపాడు, భీమవరం, అబ్బూరు, గండ్లూరు, దీపాలదిన్నెపాలెం గ్రామాల ఉప సర్పంచ్‌లు, ఒక్కో గ్రామం నుంచి ఎంపికైన ఇద్దరు వార్డు మెంబర్లకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ కార్యక్రమాల విషయంలో కీలక పాత్ర పోషించాలన్నారు. అన్ని రకాల గ్రామ పంచాయతీల అభివృద్ధి, ప్రణాళికలో భాగ స్వామ్యం కావాలన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు భాగ స్వామ్యంతో కలిసి అన్ని అంశాలపై పూర్తి అవగాహన కలిగి ప్రజలకి సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందన్నారు. శిక్షణలో ఈఓపీఆర్డీ అన్నపరెడ్డి శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, మండల పరిషత్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య విస్తరణాధికారికి సన్మానం



శిఖాశ్యాంసన్‌ను సత్కరించిన పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

క్రోసూరు: వైద్య ఆరోగ్య శాఖలో వివిధ హోదాల్లో 34 సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్‌ను క్రోసూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిరిచందన, డాక్టర్ మహమ్మద్ సాద్, డాక్టర్ ధనుష్ శాంసన్‌ను సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. హెల్త్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరి ఎన్నో ఉద్యోగోన్నతులు పొందిన శ్యాంసన్ వృత్తిపట్ల అంకిత భావం పనిచేశారన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు చిరపరిచితుడు, మంచి పేరు తెచ్చుకున్నవాడని అన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాంబశివరావు, ఆరోగ్యపరివేక్షకురాలు అమర జ్యోతి, స్టాఫ్ నర్స్ అంజమ్మ, వీరయ్య ఫార్మసిస్ట్ ఫాతిమా బేగం ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదలలో సీపీఎం మహాసభ



సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న బాలకృష్ణ, నాయకులు

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో సీపీఎం ఒకటవశాఖ మహాసభ సోమవారం జరిగింది. సీపీఎం జెండాను పార్టీ సీనియర్ సభ్యులు రావిపాటి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. రైతులకు, కౌలు రైతులకు భూయజమానితో సంబంధ లేకుండా కౌలు కార్డులు అందజేసి రుణాలు అందించాలని, మాదల నుంచి దూళిపాళ్ళ, వెన్నాదేవి లింక్ రోడ్లను ఏర్పాటు చేయాలని తీర్మానించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.ఆంజనేయనాయక్, మండల కార్యదర్శి గుంటుపల్లి బాలకృష్ణ పాల్గొని మాదల ఒకటవ శాక కార్యదర్శిగా పఠాన్ సైదాఖాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు మార్పుల వెంకటరెడ్డి, గారా జాలయ్య తదితరులు పాల్గొన్నారు.



సత్తెనపల్లి: మహచండీదేవిగా శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి



సత్తెనపల్లి: త్రిశక్తి దుర్గాపీఠంలో శ్రీలలిత త్రిపుర సుందరీ దేవి



సత్తెనపల్లి: సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో మహాచండీ దేవి



నకరికల్లు: శ్రీమహాకాళీ అలంకరణలో అన్నపూర్ణాదేవి



క్రోసూరు: అన్నపూర్ణాదేవిగా వాసవీ మాత



బెల్లంకొండ: మహచండీ అలంకరణలో మహాలక్ష్మి



రాజుపాలెం: చండీ దేవిగా అమ్మవారు



అచ్చంపేట: సంతానలక్ష్మిగా సీతాదేవి



సత్తెనపల్లి: వడ్డవల్లి బొడ్డురాయి సెంటర్‌లో మహచండీ దేవి



సత్తెనపల్లి: వెంకటపతి కాలనీలో రజత కవచాలంకృత దేవి

వైభవంగా దేవి శరన్నవరాత్రులు

సత్తెనపల్లి: దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని దేవి శరన్నవ రాత్రుల మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. పలు గ్రామాల్లో సోమవారం అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.



సత్తెనపల్లి: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పూజలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



2001 బ్యాచ్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఊటుకూరు(క్రోసూరు): తమ చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. నాటి స్నేహితులు సోమవారం ఆత్మీయ సమ్మేళనంతో ఒక్కటయ్యారు. ఊటుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2001 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు తమ ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, తెలుగు పండిట్ మోమన్‌శర్మ, హిందీ పండిట్ కర్నాటి కృష్ణారావు, వరప్రసాద్, వెంకటరెడ్డి, వెంకట్రావు, నాగవర్ధన్, బాలకృష్ణారెడ్డి, చంద్రశేఖరరెడ్డిని ఘనంగా సత్కరించుకున్నారు. పాఠశాల ఫౌండర్ శాఖమూరి కోటయ్యను స్మరించుకున్నారు. పూర్వ విద్యార్థులు కొమ్మనాగరాజు, టి.శుభనివాసరెడ్డి, వై.శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, పి.శ్రీనివాస్, రాజేష్, చంద్రశేఖర్ రెడ్డి, రహిమాన్, శ్రీకాంత్, శేషయ్య, శిరీషా, స్రవంతి, అన్నపూర్ణ, విజయశ్రీ, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మర్యాద పూర్వకంగా



మెమెంటో అందిస్తున్న ఆర్డీఓ రమాకాంత్‌రెడ్డి



పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఐ సుబ్బారావు

సత్తెనపల్లి: సాధారణ బదిలీల్లో భాగంగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి గాజులపల్లి వెంకట రమాకాంతరెడ్డి, సత్తెనపల్లి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎంవీ సుబ్బారావు సోమవారం సత్తెనపల్లి శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మెమెంటో, పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

పిచ్చి కుక్కల పట్టివేత

నకరికల్లు: పిచ్చి కుక్కల బారి నుంచి రక్షణ కల్పించేందుకు సత్వర చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి కె.వి.ఎస్ ప్రసాద్ అన్నారు. స్థానిక సినిమా హాలు బజారులో పిచ్చికుక్కలు ఇద్దరిని గాయపరిచాయి. ఈ మేరకు స్థానిక సచివాలయంలో ఫిర్యాదు చేశారు. స్పందించిన కార్యదర్శి ప్రసాద్ కుక్కలను పట్టించారు. చిలకలూరిపేట నుంచి కుక్కలను పట్టుకునే వారిని పిలిపించామన్నారు. భయాందోళనలకు గురికావద్దని స్థానికులకు ధైర్యం చెప్పారు.

చౌక బియ్యం పట్టివేత

చిలకలూరిపేట: చౌక బియ్యాన్ని పట్టణ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. పట్టణ ఎస్ఐ డి.చెన్నకేశవులు తెలిపిన వివరాలు.. చౌకబియ్యం తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు పట్టణంలోని వేలూరు రోడ్డులో దాడి చేసి మినీ లారీలో తరలిస్తున్న చౌకబియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.